క్లుప్తంగా

విద్యుత్‌శాఖ అధికారుల దాడులు

చినగంజాం: మండలంలో విద్యుత్ శాఖాధికారులు శుక్రవారం విద్యుత్ వినియోగదారుల గృహాలపై దాడులు నిర్వహించారు. దాడులలో మొత్తం 32 బృందాలు, 64 మంది సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. మొత్తం 52 కేసులు నమోదైనట్లు, తనిఖీల్లో అక్రమంగా కరంటు వాడకం చేస్తున్న వినియోగదారులకు సంబంధించి ఒక కేసు, అదనపు లోడు కింద 51 కేసులు నమోదు చేశామని ఏఈ పడవల గణనారాయణ తెలిపారు. రూ.3.35 లక్షల విధించినట్లు ఆయన తెలిపారు. చీరాల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కే జాన్‌థామస్, విజిలెన్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీవీఆర్ మల్లికార్జున ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. కార్యక్రమంలో వేటపాలెం, చీరాల, పర్చూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు జే శ్రీనివాసులు, బీ హరిప్రసాద్, ఎం రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మార్టూరు: దొంగలు మరోసారి రెచ్చిపోయారు. మార్టూరు రాంనగర్ కాలనీలో శుక్రవారం ఉదయం మరో చోరీ జరిగింది. అందిన వివరాల మేరకు.. స్థానిక ఎమ్మార్సీలో సీఆర్పీగా పనిచేసే గద్దె రమేష్ యద్దనపూడి మండలం యనమగల పంచాయతీ కార్యదర్శి రాణి భార్యాభర్తలు. వీరు స్థానిక రామ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. గత వారం రోజులుగా వీరు వీరి స్వగ్రామం ద్రోణాదుల నుంచి తమ తమ విధులకు వెళ్లి వస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఐదు గంటల ప్రాంతంలో ఇద్దరు దుండగులు కాలనీకి వచ్చి ఇంట్లోని బీరువా అందులోని లాకర్ ను ధ్వంసం చేసి బట్టలు, వస్తువులను చిందరవందరగా పడవేసి అందులో దొరికిన రూ.20 వేల నగదును చోరీ చేశారు. విలువైన బంగారు నగలు ఉన్న మరో లాకరు నిందితుడికి తెరవడం సాధ్యం కాకపోవడంతో వదిలి వెళ్లినట్లు బాధితురాలు రాణి తెలిపారు. రెండో నిందితుడు రాణి ఎదురింటిలోని గోడ దూకి ఇంటి ముందు భాగాన అమర్చిన సీసీ కెమెరాలను ధ్వంసం చేసి తిరిగ్గా ఇద్దరు కలిసి వెళ్లిపోయారు. రమేష్ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయవాదులపై దురుసు ప్రవర్తన తగదు

చీరాల రూరల్: న్యాయవాదులపై పోలీసులు దురుసు ప్రవర్తన తగదని పలువురు న్యాయవాదులు ఖండించారు. గుంటూరు జిల్లా పొన్నూరు కోర్టులో విధులు నిర్వర్తిస్తున్న న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై పోలీసులు చేసిన దాడిని నిరసిస్తు రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా శుక్రవారం న్యాయవాదులు తమ విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు మాట్లాడారు. పొన్నూరులోని న్యాయవాదిపై పోలీసులు అకారణంగా దాడి చేసి గాయపరడమే కాకుండా ఆయనపైనే కేసు నమోదు చేయడం బాధకరమైన విషయమన్నారు. ఇప్పటికే ఈ విషయమై అనేక విధాలుగా నిరసనలు చేపట్టామని చెప్పారు. తక్షణమే సంబంధిత బాధ్యులు సీఐ, ఎస్సై, ఇతర పోలీసు కానిస్టేబుల్లపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

రోగికి ఆర్థిక సాయం



మార్టూరు: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న యువకుడికి దాతలు సాయం అందించారు. స్థానిక గొట్టిపాటి హనుమంతరావు కాలనీలో నివాసం ఉంటున్న పఠాన్ సుభాని కుమారుడు పఠాన్ జబ్బర్ (22) తన రెండు కిడ్నీలు పాడైపోయి గత కొంతకాలంగా డయాలసిస్ చేయించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇదే వ్యాధితో జబ్బార్ తల్లి కొంతకాలం క్రితం మరణించింది. ఏమాత్రం ఆర్థిక పరిస్థితి బాగాలేని జబ్బార్ కుటుంబ పరిస్థితి తెలుసుకున్న హెల్పింగ్ హాండ్స్ సంస్థ ప్రతినిధులు శుక్రవారం వారి నివాసానికి వెళ్లి సంస్థ తరుపున రూ.20 వేలు, నిత్యావసరాలు అందించారు. దాతలు పఠాన్ సలీం, షేక్ కాలేషా, షేక్ బాషా, ఎస్ ఆర్ షూ మార్ట్ రహీం, విజయసాయి కుమార్,సి.కె టైలర్‌లను అభినందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పఠాన్ ఖాదర్ వలి, కె హరిబాబు, పాల్, బాషా, కోటేశ్వరరావు, బొల్లాపల్లి బెంజిమెన్, మహేశ్వరరావు, పాలచౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వహిందీ ఉత్సవ్

అద్దంకి: పట్టణంలోని కట్టారామకోటేశ్వరరావు డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం విశ్వహిందీ ఉత్సవ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దానిలో భాగంగా యువత బాధ్యత, దేశ భవిష్యత్‌లో యువత పాత్ర గురించి అధ్యాపకులు విద్యార్థులకు వివరించారు. తరువాత సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ వీ మోహనరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

పర్చూరు (చినగంజాం): పర్చూరులో నూతనంగా నిర్మాణం జరుపుకుంటున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి సమేత అష్టలక్ష్మి దేవాలయం నిర్మాణ నిమిత్తం దాతలు రూ.1 లక్ష విరాళం అందించారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినం రోజున దేవాలయానికి విరాళాన్ని దాతలు వేముల వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, వారి కుమారులు ఆదిశేషు, శ్రీనివాసరావు, వీరాస్వామి, మార్టూరు డిప్యూటీ తహసీల్దార్ నాగలక్ష్మిలు పాల్గొని అందజేశారు.

మేం అధికారంలోకి వస్తే రైతులకు ఖరీఫ్ సీజన్ నుంచే అన్నదాత భరోసా కింద రూ.20 వేలు ఇస్తాం.. అంతేకాకుండా ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తాం అని కూటమి నాయకులు ఊదరగొట్టారు. కానీ అధికారంలోకి వచ్చాక తెప్ప తగలేసినట్లు వెంటనే మాట మార్చారు. ప్రభుత్వం దగ్గర నిధుల్లేవు చూస్తే భయం వేస్తోంది.. అన్న సీఎం చంద్రబాబు మాటలు చూస్తే వ్యవసాయం దండగా అనే అర్థం వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఘాటు తగ్గిన మిర్చి

- మిర్చి ధర పతనం
- నియోజకవర్గంలో 14500 ఎకరాల్లో మిర్చి సాగు
- కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకున్నా పెరగని రేటు
- కొత్త సరుకు వచ్చినా కదలని పాత నిల్వలు
- దిక్కుతోచని రైతులు-ఆదుకోని కూటమి ప్రభుత్వం



బూదవాడలో మిర్చిని ఆరబెడుతున్న రైతు

జే.పంగులూరు:

అసలే ప్రకృతి విపత్తలతో సర్వం కోల్పోయి అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ఎంతో కొంత ప్రకృతి విపత్తులను తట్టుకొని పంటను కాపాడుకున్నాడు. తీరా చూసేసరికి సరైన గిట్టుబాటు ధర లేక రైతులు నట్టేట మునుగుతున్నాడు. మార్కెట్ యార్డులో మిర్చి ధరలు అంతకంతకూ పడిపోతున్నాయి. ఈ ఏడాది సీజన్ ప్రారంభంమైనా పాత నిల్వలు కదలడం లేదు. కొత్త సరుకుకు ధర పలకడం లేదు. మరో వైపు కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వలు పేరకుపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఇతర దేశాలకు ఎగుమతి అర్డర్లు తగ్గాయని, ఇతర రాష్ట్రాల్లో కూడా మిర్చి సాగు పెరిగిందని మిర్చి వ్యాపారులు తెలియజేస్తున్నారు. గతేడాది కన్నా ఈ ఏడాది మరింత తగ్గాయి. 20 రోజుల నుంచి కొత్త సరుకు గుంటూరు యార్డుకు వస్తోందని వ్యాపారు చెప్తున్నారు. ప్రధానంగా తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన కొన్ని ప్రాంతాలతో పాటు రాయలసీమ నుంచి గుంటూరు యార్డుకు వేల టిక్కిలు యార్డుకు వస్తున్నాయి.

నియోజకవర్గంలో మిర్చి సాగు ఎకరాల్లో..	
జే.పంగులూరు	2500
బల్లికురవ	2750
అద్దంకి	3200
సంతమాగులూరు	3400
కొరిశపాడు	2650

దిగజారుతున్న ధరలు..

మిర్చి అన్ని రకాల కనిష్ట ధర రూ.7500 మాత్రమే ఉందని, గరిష్ట ధర మేలు రకాలకు రూ. 16500 సాధారణ రకాలకు రూ. 14500 మించిలేదు. గత ఏడాది ఇదే రోజుల్లో క్వింటాలకు సగటు కనిష్ట ధర రూ. 12 వేలు, గరిష్ట ధర రూ. 20 వేల వరకు ధర పలికింది. ప్రస్తుతం క్వింటాలుకు అన్ని రకాల ధర రూ. 4 వేల నుంచి 5 వేలు వరకు తగ్గింది. ప్రత్యేక రకాలైన తేజ, బాడిగ ధరలు కూడా భారీగా తగ్గాయి. తేజ కనిష్ట ధర రూ. 7500, గరిష్ట ధర రూ. 16500 ఉంది. బాడిగ కనిష్ట ధర రూ.7500, గరిష్ట ధర రూ.13500 ఉంది. దేవనారు డీలక్స్ కనిష్ట ధర రూ. 8500, గరిష్ట ధర రూ. 15 వేలు వచ్చింది. కోల్డ్ స్టోరేజిల్లో నిల్వ చేసుకున్న ఏసీ కామన్ వెరైటీలకు క్వింటాలకు సగటు కనిష్ట ధర రూ. 7500, గరిష్ట ధర రూ. 13500 మాత్రమే లభిస్తోంది. స్పెషల్ వెరైటీలు తేజకు కనిష్ట ధర రూ. 8 వేలు, గరిష్ట ధర రూ. 16500 వచ్చింది. గతేడాది సీజన్ ముమ్మరంగా సాగుతున్న తరుణంలో మార్చి అనంతరం ధరలు బాగా తగ్గడంతో భవిష్యత్‌లో మంచి వస్తాయని ఆశించి రైతులు కోల్డ్ స్టోరేజిల్లో నిల్వ చేసుకున్నారు. ఇప్పటికీ కోల్డ్ స్టోరేజీల్లో పాత సరుకు ఖాళీ అయిన పరిస్థితులు లేవు. కొత్త సరుకు వస్తుంది.. ధర రావడం లేదని పాత నిల్వలను అమ్మే పరిస్థితి లేదని తెలిపారు.

మిర్చితో పూర్తిగా నష్టపోయాను..



రెండు ఎకరాలను రూ.15 వేలు కౌలుతో పొలం తీసుకొని మిర్చి సాగు చేశాను. రూ.2 లక్షల మేర పెట్టుబడి పెట్టాను. తెగుళ్ల వ్యాపించి ఎకరాకు 10 కింటాలు చొప్పున 20 దిగుబడి వచ్చింది. సరైన ధరలేక కోల్డ్ స్టోరేజీలో పెట్టాను. ఇప్పుడు ప్రస్తుతం క్వింటా రూ. 6000 అడుగుతున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే అవకాశం కనిపించలేదు. ఈఏడాది మిర్చి వదిలేసి పొగాకు వేశాను.

దాసరి సొల్మన్, కౌలు రైతు, పంగులూరు

ఎకరాకు రూ.1 లక్ష నష్టపోయాను..



ఈ ఏడాది 2.50 ఎకరాలు మిర్చి పంట వేశాను. పంట వేసిన నాటినుంచి ఇప్పటికి ఎకరాకు రూ.1 లక్ష ఖర్చు పెట్టాను. మూడు నెలలో పంటకు ఒక్కసారిగా వైరస్ తెగులు వ్యాపించింది. ఎన్ని మందులు కొట్టినా తెగులు తగ్గలేదు. కొట్టులో తెచ్చిన ఎరువులు, పురుగు మందులకు అప్పులు పేరుకుపోయాయి. ప్రభుత్వం గమనించి మిర్చి రైతులను అదుకోవాలి.

– వరికల్లు శేషయ్య, బూదవాడ

వైకుంఠద్వార దర్శనం.. సకల పాపహరణం



కారంచేడు వెంకటేశ్వరస్వామి గుడిలో భక్తుల పూజలు



అద్దంకిలో రాత్రికి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు



వేటపాలెంలో అలకంరణలో వేంకటేశ్వరస్వామి

- భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి
- దేవాలయాల్లో ఉత్తర ద్వారదర్శనం

చీరాల/వేటపాలెం: వైకుంఠద్వార దర్శనం చేసుకుంటే సకల పాపాలు తొలగుతాయని భక్తుల విశ్వాసం. ఇహలోకంలో సర్వసంపదలతో తులతూగాలని, పరలోకంలో మోక్షప్రాప్తి లభించాలని కోరుకుంటూ భక్తులు అర్ధమిలిత నేత్రాలతో స్వామివారిని మొక్కుకొని భక్తిపారవశ్యంతో పులకించిపోయారు. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం వేకువజాము నుంచే చీరాల పట్టణం, మండలలోని పలు గ్రామాల్లోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున 4.30 గంటల నుంచే భక్తులు తలస్నానం ఆచరించి దేవదేవుళ్లను దర్శించుకున్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా అన్ని దేవాలయాలలో ఉత్తర ద్వారదర్శనం ఏర్పాటు చేశారు. దేవదాయ శాఖ పరిధిలోని అన్ని దేవాలయాల్లో ఉత్తర ద్వారదర్శనాన్ని ఏర్పాటు చేశారు. వీరరాఘవస్వామి దేవాలయం, పేరాల మదనగోపాలస్వామి, భావనారుషిస్వామి, వేదవల్లి కనకవల్లి వీరరాఘవస్వామి, సంతబజారులోని వేణుగోపాలస్వామి, విఠల్ నగర్‌లోని పాండురంగస్వామి దేవాలయం, బస్టాండ్‌లోని వెంకటేశ్వరస్వామి, కామాక్షమ్మ దేవాలయాల్లో స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి ఉత్తర ద్వారం వద్ద భక్తుల దర్శనార్థం ప్రత్యేక దర్శనాన్ని ఏర్పాటు చేశారు.

➤ వేటపాలెంలో వెంకటేశ్వర స్వామి దేవస్థానం వద్ద శుకరవారం తెల్లవారు జామున రెండు గంటల నుంచి భక్తులు ఉత్తర ద్వారం వద్ద స్వామి వారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. చెన్నకేశవస్వామి వారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని శేషవాహనంపై ఉంచి ఊరేగింపు నిర్వహించారు. అణమల్లిపేటలో వేంచేసియున్న రుక్మీసత్యభామ సమేత వేణుగోపాల స్వామివారి దేవస్థానం, పందిళ్లపల్లిలోని వేణగోపాలస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు..

కారంచేడు/చినగంజాం/పర్చూరు(చినగంజాం)/మార్టూరు/యద్దనపూడి: వైకుంఠ ఏకాదశి రోజున జరిపే ఉత్తరద్వార దర్శన భాగ్యం పొందేందుకు భక్తులు పోటెత్తారు. మండలంలోని స్వర్ణ, కారంచేడు, దగ్గుబాడు, ఆదిపూడి, కుంకలమర్రు గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వల్లభరాయ స్వామి గుడి, కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలోను భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కారంచేడు పెద్ద బజారు శివాలయంలో వేకువజామునే భక్తులు దీపారాధనలు చేశారు. ఆలయ అర్చకులు ఏవీఎస్ బ్రదర్స్, ఆశహరి శ్రీనివాసాచార్యులు, దివి వల్లభాచార్యులు, రఘునందాచారి, కారంచేటి వీరాంజనేయ శర్మలు భక్తులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

➤ యద్దనపూడిలో మండలంలోని పూనూరు వేణుగోపాలస్వామి, యద్దనపూడిలోని కల్యాణ వెంకటేశ్వర స్వామి, చింతపల్లిపాడు, గన్నవరం వేణుగోపాల స్వామి ఆలయాల్లో భక్తులు ఉత్తరద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు.


➤ వైకుంఠ ఏకాదశి సందర్భంగా పర్చూరులో భక్తులు కలశాల గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అష్టలక్ష్మి దేవాలయం నుంచి బొమ్మల సెంటర్ మీదుగా కలశాలను చేతబట్టి గ్రామోత్సవం నిర్వహించారు.

➤ చినగంజాం బావన్నారాయణస్వామి దేవాలయంలో శ్రీదేవి, భూదేవి సమేత భావన్నారాయణుని ఉత్తర ముఖంగా ఏర్పాటు చేసి భక్తుల దర్శనార్థం ఉంచారు. ఆలయ అర్చకులు మోహన లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ప్రాంగణంలో పల్లెపాలెం వాటుపల్లి వెంకటేశ్వర్లు కోలాట బృందం ప్రదర్శించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వలివేటి రామానుజం, శివనారాయణ, వలివేటి విశ్వనాథబాబు, పిచ్చయ్య పాల్గొన్నారు.

బల్లికురవ/అద్దంకి రూరల్ /మేదరమెట్ల: ఉత్తద్వార దర్శనం ప్రతి ఒక్కరికి శుభప్రదమని ఆలయ అర్చకులు ఐవీ సుబ్బాచార్యులు ఎస్ అనిల్ వీ.మారుతి, ఐవీఎంఎస్ ఆచార్యులు అన్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా బల్లికురవ మండలంలోని ఆలయాల్లో తెల్లవారుజామున 4 గంటల నుంచి భక్తులు పోటెత్తారు. కొమ్మినేనివారిపాలెం, కొత్తపాలెం, కొండాయపాలెం, చెన్నుపల్లి కొదదెన కొత్తమల్లాయపాలెం, కొప్పరపాలెం, కొత్తూరు, కూకట్లపల్లి వైదన గ్రామాలోని విష్ణు ఆలయాల్లో ప్రత్యేక పూజలతోపాటు విశిష్ట అలంకరణ చేపట్టారు.

➤ మేదరమెట్ల వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులు పెద్ద సంఖ్యలో ముక్కోటిఏకాదశిని మండలంలోని దేవాలయాల్లో శుక్రవారం వైభవంగా నిర్వహించారు.

➤ శింగరకొండ దేవస్థానంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అద్దంకి కాకానిపాలెంలోని రంగనాథస్వామి దేవస్థానం వద్ద, మెయిన్‌రోడ్‌లోని మాధవస్వామి దేవస్థానంలో వేకువ జామునుంచి భక్తులు బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు.



కొత్తపాలెం కోదండరామాలయంలో..

వైద్యశాలలో సంక్రాంతి సంబరాలు

బల్లికురవ: విధి నిర్వహణలో ఒత్తిళ్లను అధిగమించేందుకు సంక్రాంతి ముందస్తు సంబరాలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు షేక్ రమీజ్ అహమ్మద్, జీ. రవితేజ, మమత అన్నారు. శుక్రవారం సాయంత్రం పీహెచ్‌సీలో క్రిస్మస్, నూతన సంవత్సరం, వేడుకలో భాగంగా వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వేడుకల ప్రారంభంలో భాగంగా కేక్ కట్ చేశారు. 22 సచివాలయాల్లో పనిచేస్తున్న ఎఎన్‌యంలు ఆశావర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీ లు, హెల్త్ అసిస్టెంట్‌లు 104, 108 సిబ్బందికి ముగ్గురు, మ్యూజికల్ చైర్, లెమన్ అండ్ స్పూన్, పరుగు, స్కిప్పింగ్ పోటీలు నిర్వహించారు.

వెలిగిన వీధి దీపాలు..

సాక్షి ఎఫెక్ట్..

చీరాల టౌన్: గ్రామంలోని కాలనీల్లో రోజుల తరబడి వ్యర్థాల నిల్వలతో గ్రామస్తులు పడుతున్న తీవ్ర ఇబ్బందులపై అధికారులు స్పందించారు. శుక్రవారం సాక్షి దిన పత్రికలో 'సమస్యల చట్రంలో తోటవారిపాలెం' కథనాన్ని ప్రచురించింది. స్పందిన అధికారులు శుక్రవారం కార్యదర్శి ఎం. భారతి, తన సిబ్బందితో కలిసి గ్రామంలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. వీధి దీపాలకు మరమ్మతులు చేసి కొత్తవి వేయించారు. అధికారుల ఉదాసీనత, పంచాయతీలో టీడీపీ నాయకులు చేస్తున్న కర్ర పెత్తనంపై కథనం ప్రచురించి సమస్యను పరిష్కరించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేయడంతో పాటుగా కృతజ్ఞతలు తెలిపారు.



శుభ్రం చేయిస్తున్న పంచాయతీ సెక్రటరీ భారతి

పార్టీ జెండా మోసే కార్యకర్తకే తొలి ప్రాధాన్యత



ఇన్‌చార్జ్ మధుసూదన్‌రెడ్డిని కలిసిన బ్రహ్మానందరెడ్డి, కార్యకర్తలు

- నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన్‌రెడ్డి



మధుసూదన్‌రెడ్డిని కలిసిన మండల కన్వీనర్‌లు, పర్చూరు నాయకులు

ఇంకొల్లు (చినగంజాం): పార్టీ జెండా మోసి కష్టపడే కార్యకర్తకే తన తొలి ప్రాధాన్యత ఇస్తామని పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాదె మధూసూదనరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఇంకొల్లు మండలంలోని ఇన్‌చార్జి స్వగ్రామం పావులూరులో పార్టీ శ్రేణులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీ చాల బలంగా ఉందన్నారు. తన తండ్రి మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి ఇదే నియోజకవర్గంలో మూడు సార్లు గెలిచారని ఆయన గుర్తు చేశారు. నియోజకవర్గంతో తనకు మంచి పరిచయాలు కూడా ఉన్నాయని, నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించి అందరినీ కలుస్తానన్నారు. పార్టీ జెండాలు మోసి కష్టపడిన వారికి తన వద్ద తొలి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈసందర్భంగా గ్రామంలో సందడి నెలకొంది. వైఎస్సార్ సీపీ జెండాలు, కార్యకర్తలతో గ్రామం నిండిపోయింది. నియోజకవర్గ పార్టీ శ్రేణులలో జోష్ నిండింది. నియోజక వర్గం నలుమూలల నుండి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనను మర్యాద పూర్వకంగా కలిసేందుకు వస్తుండటంతో ఇన్‌చార్జ్‌లో నూతన ఉత్తేజం నెలకొంది. నియోజకవర్గంలో వర్గవిభేదాలు లేకుండా అందరిని కలుపుకొని ముందుకు వెళ్తానని చెప్పారు. పార్టీ సీనియర్ నాయకుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో చినగంజాంకు చెందిన 50 మంది పార్టీ కార్యకర్తలు, పర్చూరు వైస్ ఎంపీపీ పాలేరు వీరయ్య, పర్చూరు, ఇంకొల్లు, చినగంజాం మండల పార్టీ అధ్యక్షులు కఠారి అప్పారావు, బండారు ప్రభాకరరావు, మున్నం నాగేశ్వరరెడ్డి, కొత్తపాలెం సర్పంచ్, యద్దనపూడి హరిప్రసాద్, లంకాశివ, షేక్ షంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షుల నియామకం

చీరాల: చీరాల నియోజకవర్గంలోని చీరాల మున్సిపాలిటీ, చీరాల రూరల్, వేటపాలెం మండలాలకు నూతన అధ్యక్షులను పార్టీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం నియమించారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు చీరాల పట్టణ అధ్యక్షుడిగా యాతం మధుకర్ (మేరిబాబు). చీరాల రూరల్ అధ్యక్షుడిగా బి.అద్దంకిరెడ్డి, వేటపాలెం మండల అధ్యక్షుడిగా ఉమ్మిటి శివరామకృష్ణలను నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమపై నమ్మకం ఉంచి పార్టీకి నూతన అధ్యక్షుడిగా నియమించినందుకు అధినేత జగనన్నకు, నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌కు, మాజీ ఎమ్మెల్యే బలరాంకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నమ్మకాన్ని వమ్ము కానివ్వకుండా పార్టీని బలోపేతం చేస్తామని వారు తెలిపారు.

తూతూ మంత్రంగా సమావేశం

కారంచేడు: తూతూ మంత్రంగా మండల సమావేశం నిర్వహించారు. సమస్యలు పరిష్కారం అవ్వనప్పుడు సమావేశాలు నిర్వహించడం దండగేనని పలువురు పాలకులు అధికారులకు సూచించారు. శుక్రవారం ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన మండల పరిషత్ సమావేశపు హాలులో సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలపై పాలకులు గళమెత్తారు. మొదట కారంచేడు ఎంపీటీసీ యార్లగడ్డ అక్కయ్యచౌదరి అకాల మారణాన్ని చింతిస్తూ సభ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చాలి

చీరాల టౌన్: చీరాల పట్టణం, రూరల్ గ్రామాల్లో నివేశన స్థలాలు లేక నిరుపేదలు అవస్థలు పడుతున్నారు.. ఏళ్ల తరబడి స్థలం కోసం అర్జీలు పెట్టుకుంటున్నా అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమని సీపీఐ నాయకులు అన్నారు. శుక్రవారం చీరాల తహశీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరుపేదలకు నివేశన స్థలాలు ఇవ్వాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఐ నియోజకవర్గ నాయకులు శ్యామ్యూల్, వెంకటరావులు మాట్లాడుతూ తాను అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుపేదలు అందరికి స్థలాలు ఇచ్చి పక్కా ఇంటి నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పట్టణ ప్రాంతాల్లోని పేదలకు 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్ల స్థలం ఇవ్వాలని కోరుతూ 85 మంది అర్జీలను డిప్యూటీ తహశీల్దార్ దేవతోటి అర్జున్‌కు అందించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సంతమాగులూరులో..

సంతమాగులూరు (అద్దంకి): ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వ పెద్దలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ నాయకుడు ఖాదర్ బాషా అన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి ఇంటి స్థలం ఇవ్వాలని సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండల తహశీల్దార్ కార్యాలయం ముందు శుక్రవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సఘ నాయకుడు మేకల రమణయ్య, శంషుందీ మహ్మద్ ఉన్ని నక్కా సాలేశ్వరి, సుబ్బమ్మ, పద్మ, రషీదా, మాసాబీ, పాల్గొన్నారు.



చీరాలలో రిలే దీక్షస్తున్న సీఐటీయూ నాయకులు

సమ్మెకాలంలో ఇచ్చిన హామిలు అమలు చేయాలి

చీరాల అర్బన్: మున్సిపల్ కార్మికులకు గత సమ్మె కాలంలో ప్రభుత్వం ఇచ్చిన హామిలు అమలు చేయాలని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం చీరాల మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత సమ్మె కాలంలో ఇచ్చిన హామీలు అమలులో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కార్యక్రమానికి యూనియన్ జిల్లా కన్వీనర్ చిమటా వీరాస్వామి అధ్యక్షత వహించగా రిలేదీక్షలో యూనియన్ నాయకులు వై.సింగయ్య, ఎన్.రాజు, ఎం.శంకర్, షేక్ చాంద్‌బాషా, పండ్లూరి సురేష్, కాంతారావు, సుమన్, నిర్మల, సుభాషిణిలు కూర్చొన్నారు.